- కాంగ్రెస్ పాలనలో పాత మాట పునరావృతం
- ఖమ్మం పెద్దాసుపత్రిలో కనీస వైద్యం కరువు
- వారం రోజులుగా పనిచేయని ఎక్స్-రే మిషన్
- వైద్యుడు లేక మూలనపడిన 'టిఫా' స్కాన్
- తీవ్ర అవస్థలు పడుతున్న నిరుపేదలు



తాళం వేసిఉన్న టిఫా స్కానింగ్ రూం

# నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానకు

'నేను పోత బిడ్డో సర్కారు దవాఖానకు'.. ఇది నిన్నా మొన్నటి వరకు కేసీఆర్ ప్రభుత్వ పాలనలో ఊరూవాడా వినిపించిన మాట. అందుకు కారణం లేకపోలేదు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించింది. కార్పొరేట్ స్థాయి ఖరీదైన వైద్యాన్ని నయాపైసా ఖర్చులేకుండా పేదోడికి ప్రసాదించి పెట్టింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పాలనలో 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే పాత మాట.. కాదుకాదు.. పాత పాట పునరావృతం అవుతున్నది. దీనికి ఖమ్మం జిల్లా సార్వజనీన ఆసుపత్రే ప్రధాన తార్కాణం.

-ఖమ్మం సిటీ, డిసెంబర్ 15

జిల్లా కేంద్ర ప్రధానాసుపత్రిలో నిరుపేద రోగులకు కనీస ఆరోగ్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. సరిపడా మందులు అందించరు. రక్త, మూత్ర పరీక్షల పరికరాలు తరుచూ మొరాయిస్తుంటాయి. స్కానింగ్ యంత్రం నెలలో వారం, పదిరోజులు మాత్రమే పనిచేస్తది. గర్భిణులకు అవసరమైన 'టిఫా' స్కాన్ టప్పా కట్టేసింది. నిత్యం వేలాదిమందికి అండగా నిలవాల్సిన పెద్దాసుపత్రిలో రోజుకో సమస్య వెక్కిరిస్తున్నా పట్టించుకునే నాథుడెవరో తెలియకుండా పోయింది. మౌలిక వసతులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన ప్రభుత్వ పెద్దలు అధికార పల్లకీల్లో ఊరేగుతున్నారు. దీంతో స్థానిక వైద్యాధికారులేమో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.


ఎక్స్‌రే యంత్రం పనిచేయకపోవడంతో ఖాళీగా ఉన్న డయాగ్నసిస్ రూం, ఆఫ్‌లో ఉన్న కంప్యూటర్

## పనిచేయని ఎక్స్-రే మిషన్..

వైద్యాధికారుల నివేదిక ప్రకారం రోజుకు 250 నుంచి 300 మంది రోగులు ఎముకలు, కీళ్ల విభాగంలో ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో నమోదు చేసుకుంటున్నరు. వీరందరికీ వైద్య సేవలందించే క్రమంలో ఎక్స్‌లో వ్యాధి నిర్ధారణ ఎంతో కీలకం. కానీ ఈ ఆసుపత్రిలోని ఎక్స్-రే మెషీన్ వారం రోజులుగా పని చేయడం లేదు. నిత్యం వస్తున్న రోగులను వైద్యులు టీ హబ్‌కు పంపిస్తున్నరు. అక్కడున్న యంత్రం రెండు లేదా మూడు ఎక్స్-రేలు తీయగానే మొరాయిస్తున్నది. దీంతో నొప్పులతో బాధపడుతున్న రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నది. అత్యవసరమైన వారిని బయటకు పంపిస్తూ వైద్యులు చేతులు దులుపుకుంటున్నారు.

### ఎక్స్-రే మిషన్‌ను పునరుద్ధరిస్తాం..



జిల్లా ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్-రే మిషన్‌లో ఎంసీపీ బోర్డు పనిచేయడం లేదు. టెక్నీషియన్‌ను పిలిపించి చూపించాం. ఇంజినీరింగ్ విభాగం వాళ్లు ఆర్డర్ పెట్టారు. సోమవారం నాటికి సమస్య పరిష్కారం అవుతుంది. ప్రస్తుతానికి టీ హబ్‌లో ఉన్న ఎక్స్-రే యంత్రాన్ని వినియోగించుకుంటున్నం. ఇబ్బందేమీ లేదు. అదేవిధంగా రేడియాలజిస్ట్ లేని కారణంగా 'టిఫా' స్కానింగ్ నిలిచిపోయింది. రేడియాలజిస్ట్ పోస్ట్ కోసం మూడు, నాలుగు దఫాలు నోటిఫికేషన్లు కూడా ఇచ్చాం.

**– డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్**

## అటకెక్కిన 'టిఫా' స్కాన్..

గర్భిణుల సౌకర్యార్థం గత కేసీఆర్ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోని మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో 'టిఫా' స్కాన్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడాదిన్నర క్రితం అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దీనిని లాంఛనంగా ప్రారంభించారు. సదరు యంత్రం సాయంతో తల్లి గర్భంలోని పిండం ఐదు నెలల నుంచి ఎదుగుతున్న తీరు తెన్నులను ఇట్టే తెలుసుకోవచ్చు. ఎప్పుడైతే కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిందో ఆనాటి నుంచి 'టిఫా' టప్పా కట్టింది. కేవలం దానికి అవసరమైన వైద్యుడిని నియమించని కారణంగా ఎంతో విలువైన ఈ యంత్రం మూలనపడింది. స్కానింగ్ కోసం గర్భిణులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రైవేట్‌లో ఒక్కసారి టిఫా స్కానింగ్ చేస్తే రూ.2 వేలు ఖర్చవుతున్నది. ఈ విషయాన్ని పలుమార్లు ముగ్గురు మంత్రులు, కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల దగ్గర ప్రస్తావించినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానిక వైద్యాధికారులు వాపోతుండడం గమనార్హం.

జిల్లా పర్యాటక ప్రాంతాల్లో..

# ప్రత్యేక బృందాల పర్యటన

**కలెక్టర్ చొరవతో జిల్లాకు రెయిన్ వాటర్ ప్రాజెక్టు, స్టూడియో పంచతంత్ర టీంలు**

**టూరిస్టు ప్రాంతాల సందర్శన.. పర్యాటక రంగ అభివృద్ధికి సమాలోచనలు..**


కిన్నెరసానిలో మోటారు బోట్‌లో ప్రయాణిస్తున్న ప్రత్యేక బృందాల సభ్యులు, భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ పాల్వంచ రూరల్, డిసెంబర్ 15: రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను రాష్ట్ర పర్యాటక శాఖ కొన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించింది. ఇందులో భాగంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆ ప్రత్యేక ఏజెన్సీ బృందాలను జిల్లాకు రప్పించారు. ఆ బృందాల్లోని రెయిన్ వాటర్ ప్రాజెక్టు, స్టూడియో పంచతంత్ర టీముల సభ్యులు, కలెక్టర్ కలిసి ఆదివారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా కిన్నెరసాని అభయారణ్యాన్ని సందర్శించారు. దీని ప్రత్యేకతల గురించి కలెక్టర్ జితేశ్ ఆయా సభ్యులకు వివరించారు. ఇక్కడ టూరిజం డెవలప్‌మెంట్ కోసం చేపడుతున్న పనులు, తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు. అనంతరం కిన్నెరసాని ప్రాజెక్టులో బోటులో ప్రయాణించి ఆనంద ద్వీపాన్ని సందర్శించారు. డ్రోన్ కెమెరా ద్వారా కిన్నెరసాని అభయారణ్యం అందాలను బృంద సభ్యులు వీక్షించారు. జింకల పార్కు, ప్రాజెక్టు బాతుల పార్కును పరిశీలించారు. అనంతరం కిన్నెరసాని ప్రాజెక్టు, కేటీపీఎస్ కుడి కాలువలో పుట్టిలో ప్రయాణించారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అక్కడి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తదుపరి గోదావరి ఘాట్‌ను సందర్శించారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ పరిధిలో నిర్మిస్తున్న గిరిజన మ్యూజియాన్ని సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజనుల ప్రత్యేక వంటకాల గురించి బృందాలకు కలెక్టర్ వివరించారు. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల రామాలయం, నార చీరెల ప్రాంతం సందర్శించి అక్కడ స్థల పురాణం, ప్రత్యేకతలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుజ్జిగుప్ప నారాయణరావుపేట గ్రామంలో బృంద సభ్యులు పర్యటించారు.

# ఒకే ఒక్కడు.. 18,500 మొక్కలు..


సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో మొక్క నాటుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 15: ఔను.. ఒకే ఒక్కడు.. ఏకంగా 18,500 మొక్కలు నాటారు..! ఇన్ని మొక్కలు నాటారంటే.. ఆయనకు ఇంకేమీ పని లేదేమోనని, ఇదే పనిగా ఎంచుకున్నారేమోనని అనుకుంటే పొరబడినట్లే..!! ఆయనకు ప్రకృతి అంటే ప్రాణం. మొక్కలు నాటడమంటే ఇష్టం. ఇష్టం మాత్రమే కాదు.. అదొక బాధ్యతగా భావిస్తుంటారు. గత కొన్నేళ్లుగా ఈ బాధ్యతను కొనసాగిస్తున్నారు. ఆయన మరెవరో కాదు.. తెలంగాణ ట్రీ మ్యాన్ అవార్డు గ్రహీత, సింగరేణి సంస్థకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ)గా ఉన్న బలరాం..!! ఆయన ఆదివారం సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో పార పట్టుకుని మట్టిని తవ్వి మొక్క నాటారు. ఆయన ఇక్కడ ఇప్పటివరకూ 208 మొక్కలు నాటారు. ఆదివారం నాటిన మొక్కతో ఈ సంఖ్య 209కి చేరింది. గత కొన్నేళ్ల నుంచి సింగరేణివ్యాప్తంగా ఆయన నాటిన మొక్కల సంఖ్య ఆదివారం ఈ మొక్కతో 18,500కు చేరింది. ''పర్యావరణ సమతుల్యతకు ముప్పు ఏర్పడుతున్న పరిస్థితుల్లో.. పర్యావరణ ప్రేమికుడిగా, నా బాధ్యతగా మొక్కలు నాటే పనిని చేపట్టాను. ఇప్పటి వరకు ఆరు జిల్లాల్లో 40చోట్లకు పైగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాను. అవన్నీ చక్కగా పెరుగుతున్నాయి. వీటిలో 35కు పైగా ప్రదేశాలు ఇప్పుడు 'మినీ ఫారెస్టులు'గా మారాయి..!!!'' అని, ఆయన ఆనందం వ్యక్తం చేశారు.


ఖమ్మం కవితా మెమోరియల్ కళాశాల కేంద్రం వద్ద లోపలికి వెళ్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

# మళ్లీ సగానికంటే తక్కువగా..

- గ్రూప్-2లోనూ సుమారు 46 శాతమే హాజరు నమోదు
- ఇటీవలి గ్రూప్-3లోనూ ఇలాగే హాజరైన అభ్యర్థులు
- తాజా గ్రూప్-2లో మొదటి రోజు పరీక్ష ప్రశాంతం
- భద్రాద్రిలో 38 కేంద్రాల్లో 13,466 మంది అభ్యర్థులు..
- ఉదయం 7,142, మధ్యాహ్నం 7,218 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ
- ఖమ్మంలో హాజరు శాతాన్ని వెల్లడించని అధికారులు


కొత్తగూడెంలోని పరీక్ష కేంద్రం వద్ద చంటి పాపతో బాలింత, ఆమె భర్త

కొత్తగూడెం ఎడ్యుకేషన్/ కొత్తగూడెం క్రైం/ మామిళ్లగూడెం, డిసెంబర్ 15: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-2లోనూ సగానికి సగమే హాజరు శాతం నమోదైంది. ఇటీవలి గ్రూప్-3 పరీక్షల్లోనూ ఇలాగే జరిగింది. దీంతో గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను దాదాపు సగం మంది అభ్యర్థులే రాస్తున్నట్లవుతోంది. తాజాగా భద్రాద్రి జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్-2 మొదటి రోజు పరీక్షకు కూడా సగానికంటే కొంచెం ఎక్కువమంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లాలో మొదటి రోజు పరీక్ష రెండు సెషన్లనూ ప్రశాంతంగానే జరిగింది. పోలీసులు అధికారులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలో మొత్తం 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 13,466 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు హాల్‌టికెట్లు జారీ చేశారు. తొలి రోజు ఉదయం పరీక్షకు 6,324 మంది హాజరు కాగా, 7,142 మంది గైర్హాజరయ్యారు. హాజరు 46.96 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం పరీక్షకు 6,248 మంది హాజరు కాగా, 7,218 మంది గైర్హాజరయ్యారు. 46.4 శాతంగా హాజరు శాతం నమోదైంది. పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రాన్ని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తనిఖీ చేశారు. కొత్తగూడెం సింగరేణి ఉమెన్స్ కాలేజీ, పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్ష కేంద్రాలను ఎస్పీ రోహిత్‌రాజు పరిశీలించి బందోబస్తును పర్యవేక్షించారు. కాగా, పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఎస్పీ రోహిత్‌రాజుని అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది తనిఖీ చేసి లోపలికి అనుమతించడం విశేషం.

## ఖమ్మంలో వివరాలు వెల్లడించని అధికారులు

ఖమ్మం జిల్లాలో ఆదివారం మొదటి రోజు జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్-2 రెండు సెషన్ల హాజరు శాతం వివరాలను ఆ జిల్లా అధికారులు వెల్లడించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ హాజరుశాతాన్ని వెల్లడించినప్పటికీ ఖమ్మం జిల్లా అధికారులు మాత్రం హాజరు శాతం గోప్యంగా ఉంచారు. జిల్లాలో 85 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 28,101 మంది అభ్యర్థులు హాజరవుతారని ప్రకటించారు. కానీ వివరాలను వెల్లడించలేదు.


కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలోని పరీక్షను పర్యవేక్షిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్


తన హాల్‌టికెట్ నంబరు చూసుకుంటున్న అభ్యర్థిని


అభ్యర్థి హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్


కొత్తగూడెం సింగరేణి కాలేజీలో ఎస్పీని తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది


కొత్తగూడెంలోని సింగరేణి కాలేజీలో వెళ్తున్న గ్రూప్-2 అభ్యర్థులు

# తెలంగాణకు ఆంధ్రా ధాన్యం

- దళారులతో దోస్తీ.. బోనస్ కోసం భారీగా తరలింపు..
- తెనాలి, విజయవాడ కేంద్రంగా అక్రమ వ్యాపారం
- తెలంగాణలో కొమ్ముకాస్తున్న కొందరు మిల్లర్లు
- మిర్యాలగూడ, హుజూర్‌నగర్‌కు వందలాది లారీలు
- చెరువుమాధారం, వల్లభి గ్రామాల్లో అడ్డుకున్న రైతులు
- లారీలను వెనక్కి పంపాం: సివిల్ సప్లయీస్ అధికారులు


ఆంధ్రా నుంచి వస్తుండగా రైతులతో అడ్డుకోవడంతో చెరువుమాధారం వద్ద నిలిచిన ధాన్యం లారీలు

కూసుమంచి (నేలకొండపల్లి)/ ముదిగొండ, డిసెంబర్ 15: ఆంధ్రా ధాన్యం తెలంగాణలోకి అక్రమంగా ప్రవేశిస్తోంది. ఏకంగా వందలాది లారీల్లో అక్రమ మార్గాల్లో వస్తోంది. తెలంగాణలో వరి ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తుండడం, ఇందుకు తెలంగాణలోకి కొందరు మిల్లర్లు కొమ్ముకాస్తుండడం వంటి కారణాలతో ఆంధ్రా చెందిన కొందరు వ్యాపారులు పెద్ద మొత్తంలో ధాన్యాన్ని తరలిస్తున్నారు. అయితే, ఇంత పెద్ద వ్యవస్థలో అనేక శాఖల కంట పడకుండా, పదుల సంఖ్యలో ఉన్న చెక్‌పోస్టులను దాటుకొని ఆంధ్రా ధాన్యం తెలంగాణకు చేరుకుంటుండడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రోజుకు 50 నుంచి 100 లారీల చొప్పున గత 20 రోజులుగా భారీ లోడుతో తెలంగాణలోకి ప్రవేశిస్తుండడాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల రైతులు గమనించారు. ఈ క్రమంలో ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో వస్తున్న లారీలను నేలకొండపల్లి మండలం చెరువుమాధారం రైతులు అడ్డగించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆంధ్రాలో వరి ధాన్యానికి బోనస్ లేకపోవడం, తెలంగాణలో రూ.500 బోనస్ ఇస్తుండడంతో ఈ బోనస్‌పై ఆంధ్రాలోని విజయవాడ, తెనాలి వ్యాపారుల కన్నుపడింది. దీంతో తెలంగాణలోని కొందరు మిలర్లు, దళారులతో వీరు కుమ్మక్కయ్యారు. రోజుకు సుమారు వంద లారీల ధాన్యాన్ని తెలంగాణకు పంపుతున్నారు. ఒక్కో లారీకి కనీసం రూ.2 లక్షల వరకూ అదనంగా లాభాలు పొందేందుకు ఆంధ్రా ధాన్యాన్ని తెచ్చి తెలంగాణ గోదాముల్లో నింపుతున్నారు.


ఆంధ్రా ధాన్యాన్ని ఎలా అనుమతిస్తున్నారంటూ వల్లభి చెక్‌పోస్టు సిబ్బందిని ప్రశ్నిస్తున్న రైతులు

ఇలా ధాన్యం లోడుతో సుమారు 20 రోజులుగా పెద్ద సంఖ్యలో వస్తున్న లారీలు వస్తున్న విషయం గురించి ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువు మాధారం, ముదిగొండ మండలం వల్లభి గ్రామాల రైతులు ఆరా తీశారు. ఆంధ్రా నుంచి అక్రమంగా వస్తున్నాయని తెలుసుకొని ఆదివారం ఆ లారీలను పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఈ గుట్టు రట్టయింది.

## గ్రామాల మీదుగా రాత్రి వేళల్లో..

ఆంధ్రాకు చెందిన అక్రమార్కులు ముఖ్యంగా రాత్రి వేళల్లో తెలంగాణకు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల చెక్‌పోస్టులు తగలకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే ముదిగొండ మండలం వల్లభి వద్ద అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు ఉన్నప్పటికీ అక్కడ ఈ లారీలను ఆపకపోవడంతో నేరుగా తెలంగాణలోకి తీసుకొస్తున్నారు. ఏపీ విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం నుంచి ఎన్‌టీఆర్ జిల్లా గంప్రాయి మీదుగా కొన్ని లారీలు చెరువుమాధారానికి చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి ఖమ్మం – కోదాడ హైవే ఎక్కించి మిర్యాలగూడేనికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెరువుమాధారం రైతులు ఈ లారీలను ఆదివారం అడ్డగించి లారీ డ్రైవర్లను ప్రశ్నించారు. అయితే తాము అన్ని పత్రాలతోనే అమ్మకాలు చేస్తున్నామని కొన్ని ధ్రువపత్రాలు చూపించారు. అయినప్పటికీ అంగీకరించని చెరువుమాధారం రైతులు అసలు ఆంధ్రా ధాన్యాన్ని ఎందుకు తీసుకొస్తున్నారంటూ ప్రశ్నించారు. దీంతో లారీ డ్రైవర్లు నీళ్లు నమలడంతో విషయం బహిర్గతమైంది. ఇంతలో నేలకొండపల్లి ఎస్ఐ సంతోశ్ అక్కడకు చేరుకున్నారు. చెరువుమాధారం రైతులు, గ్రామస్తులు పట్టుకున్న లారీలను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరికొన్ని లారీలను చెరువుమాధారం చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. తరువాత వాటిని ఆంధ్రాకు తిరిగి పంపారు.

## వెనక్కు పంపిన అధికారులు..

ఆంధ్రా లారీలను చెరువుమాధారం గ్రామస్తులు, రైతులు పట్టుకున్న విషయం తెలుసుకున్న సివిల్ సప్లయీస్ అధికారులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద, చెరువుమాధారం చెక్‌పోస్టు వద్ద నిలిపి ఉంచిన లారీలను పరిశీలించి వివరాలు తీసుకున్నారు. వాటిల్లోని ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణలో విక్రయించడానికి వీల్లేదంటూ స్పష్టం చేశారు. తరువాత ఆయా లారీలను ఆంధ్రాకు తిరిగి పంపారు. కానీ, 'ఇప్పటి వరకు ఎంత వ్యాపారం జరిగింది? ఈ దందా ఎన్ని రోజుల నుంచి జరుగుతోంది?' అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. పైగా, పట్టుబడిన లారీలను తిరిగి ఆంధ్రాకు పంపి చేతులు దులుపున్నారు.

## అధికారులు, మిల్లర్ల కనుసన్నల్లో దందా?

అయితే, మిర్యాలగూడ మిల్లర్ల కనుసన్నల్లో ఈ అక్రమ దందా నెల రోజులుగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా చెరువు మాధారం, వల్లభి, ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా షేర్ మహ్మద్‌పేట మీదుగా రవాణా జరుగుతున్నట్లు ఆదివారం స్పష్టమైంది. ఇందులో కోట్లాది రూపాయల తెలంగాణ బోనస్ నగదు ఆంధ్రా దళారులు, వ్యాపారుల చేతుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. రోజుకు కనీసం 50 నుంచి 100 లారీల చొప్పున 20 రోజులుగా లారీలు తెలంగాణకు వచ్చాయంటే ఈ వ్యవహారం ఎంతపెద్ద స్థాయిలో జరిగిందో అర్థమవుతోంటూ ఇక్కడి రైతులు, గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అయితే, ఇన్ని చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ వందల సంఖ్యలో లారీలు అనుమతులు లేకుండా తెలంగాణలోకి ప్రవేశిస్తాయంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు, మిల్లర్ల కనుసన్నల్లోనే ఈ దందా జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కో లారీ ద్వారా సుమారు 400 క్వింటాళ్ల ధాన్యం రవాణా అవుతుందని, అంటే ఒక్కో లారీకి సుమారు రూ.2 లక్షల చొప్పున ఆంధ్రా వ్యాపారులు సొమ్ము చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. అయితే, ముదిగొండ మండలం వల్లభి గ్రామం వద్ద శనివారం రాత్రే కొన్ని లారీలను గ్రామస్తులు అడ్డుకొని వెనక్కి పంపించారు. దీంతో స్పందించిన జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి చందన్‌కుమార్, తహసీల్దార్ సునీతా ఎలిజెబెత్ కలిసి వల్లభి చెక్‌పోస్టును ఆదివారం పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణలోకి అనుమతించవద్దని, ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని, ధాన్యం ఉంటే వెనక్కు పంపాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయంపై డీసీఎస్‌వో చందన్ కుమార్ స్పందిస్తూ.. చెరువుమాధారం, వల్లభి చెక్‌పోస్టుల వద్ద పట్టుకున్న 31 లారీలను తిరిగి ఆంధ్రాకు పంపినట్లు తెలిపారు. సివిల్ సప్లయీస్ ఆర్ఐ నరేశ్ స్పందిస్తూ.. ఆంధ్రా ధాన్యాన్ని తెలంగాణలో విక్రయించడానికి అనుమతుల్లేవంటూ లారీలను తిరిగి పంపించినట్లు వివరించారు.